# చాపకింద నీరు

''ఏమయ్యా వెంకటాచారీ ఈ ఊరు బతకటానికి వచ్చానంటున్నావు. బ్రతుకుతెరవు చూపించమంటున్నావు. చూస్తున్నావుకదా-ఇదొక పల్లెటూరు ఉద్యోగాలిప్పించటానికి ఇక్కడేమయినా ఆఫీసులున్నాయా? ఈ ఊళ్లో అందరూ వ్యవసాయంచేసుకుని బతికేవారు'' తన మామూలు ధోరణిలో చెప్పుకుంటూ పోతున్నాడు రామన్నచౌదరి.

''అయ్యా, మీరట్లా అనకండి. ఈ ఊళ్లో నేనందరినీ వాకబుచేశాను." మీ యింట్లో దీపం పెట్టగలిగినవారు రామన్నచౌదరిగారు ఒక్కరే. వారిని కలుసు కోండి'' అని చెప్పారు. మీరే ఏదోమార్గంచూడండి. నా కుటుంబానికింత అన్నం పెట్టండి మీ మేలు మరువను'' చేతులెత్తి దణ్ణంపెట్టాడు.

''ఇలా ఎందరో వస్తారు. ఎంతమందికని జవాబుచెప్పనూ?" అనుకున్నాడు రామన్నచౌదరి. వెంకటాచారి ముఖం దీనంగాఉంది. కొంతసేపు తల తడిమి చూసుకున్నాడు.

''అయితే ఒక పనిచెయ్యి. ఈ గ్రామంలో ఒక వినాయకుడి గుడిఉంది. ఆ గుళ్లో దీపంపెట్టేవాళ్లులేరు. అది పాడుపడి పదేళ్లుకావచ్చింది. ఒక పూజారిఉండే వాడు గాని ఆయన చనిపోయిన తరువాత తగిన మనిషి దొరకక అలా వదిలి పెట్టేశారు. ఆ పని నీవు చెయ్యగలవా?''

"చేస్తానండి. మా వంశమంతా అర్చకులేనండి."

"ఆ గుడికి మాన్యాలంటూ ఏమీలేవు. నెలకు బస్తావడ్లు ఊరిమీద వసూలు చేసి ఇప్పిస్తా. మరి-నీ వెక్కడఉంటావు?"

''అదికూడా తమరే చూడాలండి. ముందు ఆ గుడి ఎక్కడుందో చూపి స్తారా?" వెంకటాచారి అప్పుడే తనకు మంచిరోజులు రాబోతున్నట్టు ఎరిగి గంతు

లేసే మనసును అదిమిపెట్టి, రామన్నచౌదరి వెంట బయలుదేరాడు. వాళ్ళవెంట ఇద్దరు రైతులుకూడా బయలుదేరారు.

ఊరిచివరగా ఒక పెద్ద చింతచెట్టు, పక్కన ఒకపక్కపడిపోయినగోడ-కప్పుపైన తాటాకులు కొన్ని లేచిపోయి ఎండా వానా లోపలికి వచ్చేటట్టుగాఉంది. వినాయకుని గోడకుచెక్కి రంగులు వేసినట్టున్నారు. రంగంతా పోయింది. లోపలంతా చెత్తాచెదారంతో విగ్రహం మూసుకుపోయినట్టుంది. మట్టికొట్టుకుపోయింది. ఆ గుడికిఆవరణంగా ముళ్ళకంచెఉంది. రామన్నచౌదరి ఏమంటావన్నట్టు వెంకటాచారి ముఖంలోకి చూశాడు.

"గుడికి ఆచ్ఛాదనముఖ్యమండి. చుట్టూగోడలుండి దానికి తలుపులుండాలి. దానిని బాగుచేయించటం అవసరమండి. ముందుగా గుడికి ఒక ఆకారం ఏర్పరచాలండి. తరువాత నాకు ఒక పాక వేయిస్తే దాంట్లో పడిఉంటానండి. గుళ్ళో దీప ధూప నైవేద్యాలకు ఏర్పాటు కావాలండి"

రామన్నచౌధరి ఆలోచిస్తున్నాడు దగ్గరలోఉన్న ఒక రాతిమీదకూర్చుని.

"గుళ్ళో పడుకోకూడదుటయ్యా? దానిని బాగుచేయించ మన్నావుగా?"

"అయ్యా, అది తప్పండి. పూజారి గుడికిబైట ఉండాలిగాని గుడిని ఇల్లుగా చేసుకుని పడుకోకూడదండి"

"ఆహాఁ. ఆ శాస్త్రంకూడాఉందా? కిష్టయ్యా! సీతయ్యా! దీనికేదో మార్గం చెప్పండి. మన గ్రామంలో పాడుపడ్డగుడిని బాగుచేసి, దీపం పెట్టటం గ్రామానికి శుభమేకదా? గుడి బాగుచేయించి తనకొక పూరిల్లు కట్టించమంటున్నాడు పూజారి. మీరంతా తలా ఒక చెయ్యివేసి, గుడిని బాగు చెయ్యటానికి అతడికి ఉండటానికి ఏర్పాటు చెయ్యండి. ఊరంతా తలాకొంచెం వేసుకుని రెండుబస్తాల వడ్లయినా ఇవ్వండే పూజారికి కుటుంబం గడవదు. మనగ్రామంలో గుడినిపునరుద్ధరించాలంటే ఈ పనులు చెయ్యాలి"

అంతలోకి పూజారి అందుకున్నాడు. "అయ్యా నిత్యం దీపం పెట్టాలంటే నైవేద్యం ఉండాలండి. ధూప దీప నైవేద్యమన్నారండి పెద్దలు. పూజాది కార్యక్రమాలండి ఇవి. వాటినిగురించి కూడా ఆలోచించండి"

"ఆ మాట నిజమే కాని రెండుబస్తాలవడ్లంటే మాటలాఅండి? అది కొంచెం కష్టమే అయినా ఎట్లాగో భరిస్తామనుకోండి. రామన్న చౌదరిగారంటే ఊరికి పెద్దలు. ఊరి బాగోగులు చూడవలసినవారు. గుడిని బాగుచేయించటం, పూజారికి పూరిల్లు కట్టించటం, దీపం నైవేద్యం తమరు చూడాలండి'' అన్నారిద్దరూ వినయంతో-రామన్నచౌదరి నుద్దేశించి.

రామన్నచౌదరి తల తడుముకుంటూ "పెద్దనంటూ ఈ భారం నామీదే పెట్టారా? అయినా తప్పేదేముంది? ఇది దేవుడికార్యం. ఏమయ్యా పూజారీ నెల కెంత ఖర్చవుతుందో అంచనాలెయ్యి'' అన్నాడు తలవంచుకుని.

అర్చకుడికి ఎంతచెప్పాలో తెలియదు. ఇద్దరుపిల్లలతో తనకు ఇల్లుగడవాలి. కాని తాను బయటపడితే అసలుకే మోసం రావచ్చుననుకుంటూ ఆలోచించుకుని, కొంత సేపటికి అన్నాడు-''విఘ్నేశ్వరుడికి ఉండ్రాళ్లంటే ఇష్టమండి. మనకు కృష్ణపక్షంలో ఒకటీ శుక్లపక్షంలో ఒకటీ నెలకు రెండుసార్లు చవితి వస్తుందండి. బియ్యప్పిండితో సెనగలుకలిపి ఉండ్రాళ్లుచేసి నైవేద్యం పెట్టాలండి. దర్శనం కోసం వచ్చినవాళ్ళచేతుల్లో ప్రసాదం తప్పకుండా పెట్టాలండి. దీనికి రెండుకిలోల బియ్యం అరకిలో సెనగలు కావాలండి. మరి ఊరి జనాభా ఎక్కువగా ఉంటే మరికొంచెం ఎక్కువ కావాల్సిఉంటుంది. నిత్యనైవేద్యం బెల్లంముక్క పెట్టచ్చు. దానికి మూడు కిలోలబెల్లం లెక్కవేసుకోండి. ఇంక దీపం రెండు పూటలాపెట్టాలి కనుక నాలుగుకిలోల నూనె లెక్కరాసుకోండి. అగ్గిపెట్టె, అగరువత్తులు, పసుపు కుంకమలు పత్తి చిన్నఖర్చు. దానిదేముంది? గుడిచుట్టూ ఊడ్చి నీళ్ళుచల్లి ముగ్గు పెట్టటానికి ఒక ఆడమనిషి ఉండాలండి"

''చాలా పెద్దలిస్టే ఇచ్చావు. ఇవేనా ఇంకా ఏవయినా ఉన్నాయా?''

''గుడి అంటే ముఖ్యమైనవీ, అతి ముఖ్యమైనవీ చాలా ఉంటాయి. పూజా పాత్రలూ, దీపపుసెమ్మె, బయట ఒక పెద్దగంట దేవుడికి హారతి ఇచ్చేటప్పుడు మోగించటానికొక చిన్నగంట హారతి ఇవ్వటానికి పళ్ళెం హారతి ఇచ్చేది ప్రత్యేకంగా దొరుకుతుంది-అదిఒకటి ఒకటి, నీళ్ళకు ఒకబిందె చెంబు ఇవన్నీ అవసరమేనండి. ఏమయ్యినా తక్కువయితే తరువాత తెచ్చుకోవచ్చండి. వీటి ధరలు దుకాణాలలో అడిగి తెలుసుకోవచ్చునండి''.

"ఇన్నికావాలా ?'' ఆశ్చర్యంతో అడిగాడు చౌదరి.

''అయ్యా చౌదరిగారూ, మీరు ఏ దేవాలయానికయినా వెళ్ళి లిస్టు రాయించుకుని తీసుకురండి. ఇవికూడా నేను ఈ గుడికి తగినట్టుచెప్పానండి. దైవకార్యం తలపెట్టినప్పుడు ఏ విషయంలోనూ లోపం జరగకూడదండి. అది మహాపాపం. లోటుబాట్లు ఏంజరిగినా కళ్ళేకాదండి మతికూడా పోతుందని పెద్దలంటారండి"

ఊఁ అంటూ పెద్దగానిట్టూర్చాడు చౌదరి.

"సరే. ఈ ఏర్పాట్లకు పదిహేనురోజులు సరిపోవు. ఒకనెల పట్టేటట్టుగా ఉంది. అంతవరకూ ఊరికివెళ్ళివస్తావా ?'' అన్నాడు.

"కట్టడాలను దగ్గరుండి చూసుకోవాలండి. వాస్తుశాస్త్ర ప్రకారం ఉండాలండి అన్నీను. గుడికి బావి ఎటువైపుఉండాలో అటువైపే తవ్వాలండి అందుకని కొంచెం బియ్యమిప్పిస్తే ఇక్కడే వండుకుని తింటూఉంటానండి" అన్నాడు.

రామన్నచౌదరికి కూడా అందరికీ ఉన్నట్టుగా అంతరాత్మఉంది. ఇంత కాలమూ నోరుమూసుకునే ఉంది. అప్పుడప్పుడు నిలవబెట్టి అడుగుతున్నా తప్పించుకు తిరిగాడు.

అసలతడు జమీందారుగారి దగ్గర దివాను. కొంతకాలమయిన తరువాత సమయంచూసుకుని ఖాళీస్థలాలను రెండువందలగజాల వంతున ప్లాట్లుచేసి చౌక ధరనిచెప్పి చాలామంది రైతులకూ ఇతరులకూ అమ్మాడు. దానితరువాత పన్నులుకట్టటమేగాని పంటలులేవని వందఎకరాలకు పైగా అమ్మించాడు. దొంగలెక్కలు చూపించి అప్పులుతేల్చాడు. జమీందారునిదేవిడీని బాగుచేయించటానికి కూడా డబ్బుపెట్టలేని స్థితికి తీసుకువచ్చాడు.

దేవాలయానికున్న మడిమాన్యాలు మటుమాయమయ్యాయి దేవాలయం పాడుపడిపోయింది.

తను స్థలాలమ్మిన వాళ్ళనూ, భూములమ్మినవాళ్ళనూ తనచేతిలో పెట్టుకున్నాడు. అదొక గ్రామంగా నిలబడ్డది.

జమీందారీ కుటుంబం చెల్లాచెదరైపోయింది. ఏ ఒకరో ఇద్దరో బ్రతుకుతెరువుకోసం బైటికివెళ్ళిపోయారు. మిగిలిన చిన్నంచిదర ప్రభుత్వం పాలయింది.

రామన్న చౌదరి జీవితం ఆ తరువాత ఉచ్చదశకుమళ్ళింది. గ్రామానికి దూరంగా ఒక పెద్దభవనంకట్టాడు. సంసారం పచ్చపచ్చగా ఉంది. కొంత మాగాణి భూమిఉంది. సిరి-సంపదలతో తులతూగుతున్నాడు. అతడు ఆ ఊరికి ఆ రైతులకు పెద్దగా చెలామణి అవుతున్నాడు.

ఇంతకాలంనుంచీ చౌదరీ అణచిపెట్టిన అంతరాత్మ ఇప్పుడు-ఆవిర్లు తేలటం మొదలుపెట్టింది. చదువుకుని ఉద్యోగం చేసుకుంటున్నకొడుకును పోగొట్టుకున్నాడు. ఇటీవల భార్యావియోగంకూడా సంభవించింది. అప్పటినుంచి అంతరాత్మది పైచెయ్యిఅయింది.

ఒకప్పుడు గుడి పాడుపడితే తనకేమనుకున్న చౌదరి జరిగినదానికి పరిహారంగా ఆ దేవాలయాన్ని పునరుద్ధరించదలచాడు. కాని-దానికి ఇంత తతంగ ముంటుందనుకోలేదు. అంతరాత్మ తృప్తికోసం చెయ్యక తప్పదని పట్నం బయలుదేరి, తెలిసినవాళ్ళనందరినీ సంప్రతించి, పూజారి చెప్పిన సామాను కొని తెచ్చాడు.

రైతులు పూజారికి వంటకు ఏర్పాట్లుచేశారు. ఆలయపు గోడలు సరిచేశారు. కప్పువేసి ఒక తలుపుపెట్టారు. దానికి చుట్టూ దడికట్టారు. దేవుడి పూజకు పూలచెట్లు చుట్టువేశారు. తులసిచెట్లు గుడికి రెండుపక్కలా నాటారు. దేవాలయం ధ్వజస్తంభానికి ఏర్పాటుచేశారు. గుడిముందరగా పందిరివేశారు. ఆ ఆవరణంలోనే పూజారికి ఇల్లుకట్టి బావి తవ్వారు.

ఇక పై పూతలు సున్నాలు కావలసి ఉంది.

రామన్నచౌదరి ఆ ఏర్పాట్లకు సంతోషించాడు. "మంచిరోజు చూసి ప్రారంభించవయ్యా పూజారీ" అన్నాడు.

ఇది శూన్య మాసమండి. వచ్చేనెల మాఘమాసం వస్తుంది. పంచమి బాగా ఉంటుంది. నేను పదిరోజులు ముందుగావెళ్ళి నా కుటుంబాన్ని తీసుకువస్తాను. మా ఊళ్ళో ఒక గొప్పపండితుడున్నాడు. ఆగమశాస్త్రాలన్నీ తెలిసినవాడాయన. ఆయనను కూడా తీసుకువచ్చి చూపిస్తాను. ఆయనచేత ప్రారంభం చేయించాలని నా సంకల్పం. మొదటిరోజు పూజావిధానమంతా ఆయన చేస్తే తరువాత అంతా

జయప్రదంగా సాగిపోతుంది. ఏమంటారు ? మీ అందరి అభిప్రాయం కూడా చెప్పండి" అన్నాడు పూజారి.

రంగులుదిద్దిన వినాయకుడు ధగధగలాడి పోతున్నాడు. పూజారి తీసుకు వచ్చిన పండితుడు ఉదయం ఐదుగంటలకు లేచి ప్రాంగణమంతా బాగుచేయించి తోరణాలు కట్టించి అరటి స్తంభాలు కట్టించి పూజ ప్రారంభించాడు. అనుకున్నట్టుగా ఊరు ఊరంతా తరలివచ్చింది. విఘ్నేశ్వరుడికి సహస్రనామార్చన జరిగింది. ఇంటికొక కొబ్బరికాయ తెచ్చారు. ఆ కాయలన్నీ కొట్టి నైవేద్యం పెట్టి కర్పూరం వెలిగించి హారతి ఇచ్చాడు.

అందరికీ పూజాపుష్పం కొబ్బరిముక్కలు ఇచ్చాడు. ముందుగానే ఏర్పాటు చేశాడు వెంకటచారి-ఊళ్లో అందరూ కర్పూరహారతి కళ్ళకద్దుకుని హారతిపళ్లెంలో ఒక్కరూపాయ వెయ్యమని. అందరూవేసిన తరువాత వెంకటాచారి రామన్న చౌదరితో ''ఇవాళ అన్నదానం చేస్తే చాలా శుభం కలుగుతుందని." రామన్న చౌదరి ''ముందుగా చెప్పద్దుటయ్యా పూజారీ" అని మనసులో శపిస్తూ ఏర్పాట్లు చేశాడు.

ఊరంతా భోజనాలుచేశారు, విఘ్నేశ్వరుడికి దణ్ణాలు పెట్టుకుని ప్రజలంతా వెళ్ళిపోయిన తరువాత-''అయ్యా ! రామన్నచౌదరిగారూ ! మీరనుకున్నట్టుగా శాస్త్రయుక్తంగా దేవాలయము ఈ రోజునుంచీ పునరుద్ధరింపబడినట్లే. అంతదూరంనుంచి రైలు ఖర్చులిచ్చి గొప్పపండితుడిని దీనికోసం పిలిపించాము. ఆయన కూడా బాగా పూజలు చేయించాడు. మనం ఆయనకు వస్త్రాలూ దక్షిణా తాంబూలం ఇచ్చి రైలుఖర్చు ఇచ్చిపంపించాలి. రైలు వేళకు బండిమీద తీసుకు వెళ్ళి రైలెక్కించి వద్దాం. మీరుకూడారండి'' అని దగ్గరకూర్చుని చెప్పాడు.

''మరి-సామాన్లు తెచ్చేటప్పుడు ఈ మాట చెప్పద్దుటయ్యా. ఇప్పుడేం చేద్దాం ? ఈ ఊళ్ళోదొరకే వస్తువుకాదాయె''

''పోనీలెండి. బట్టలకు బదులుగా నూటపదహార్లు దక్షిణగా ఇస్తేసరి" అన్నాడు పూజారి.

రామన్నచౌదరి మనసులో ఏమనుకున్నా దక్షిణాతాంబూలం సమర్పించి పండితుడిని రైలువరకూ సాగనంపివచ్చాడు.

రామన్న చౌదరి ఇంతకష్టపడి ఖర్చుచేసింది ఊరికేకాదు. గుడిపాడు పెట్టిన నాడు తనకేంపట్టలేదు. తరువాత ఆ స్థలంకూడా మెల్లగాదేనికయినా ఉపయోగ పడుతుందని అనుకున్నాడు. మరొక కొత్త ఆశ మొలకెత్తింది.

ఆ గ్రామాన్నంతా చేతిలో పెట్టుకోవాలి.

రాజకీయంగా పనికొస్తుంది ముందుముందు.

ఏ సర్పంచో అడగకపోతాడా తనకు ఓట్లు కావాలని ?

అప్పుడు తానే వీళ్ళందరిచేత ఓట్లువేయించి అయనను తనే గెలిపిస్తే ?' ఇంక ఆయనను తను వదలిపెట్టడు.

ఆయన అధికారంలో తనుకొంత అనుభవించవచ్చు. ఆ తరువాత అతడిని ఉండనీయకూడదు.

అందుకోసమే అంతకష్టపడ్డాడు గుడిని పునరుద్ధరించటానికి.

మరో నాలుగునెలలయిన తరువాత గ్రామ నివాసులందరినీ పిలిచాడు. వాళ్ళందరినీ సమావేశపరిచి ''మీకు మంచినీళ్ళు అంతదూరంనుంచి తెచ్చుకోవటం చాలా ఇబ్బందిగా ఉన్నట్టుగా గ్రహించాను. ఎందుకు అంతకష్టపడటం ? మీ కందరికీ సమ్మతమైన స్థలాలుచెప్పండి. రెండుబావులు తవ్విద్దాము చుట్టూ గోడ కట్టించి గచ్చుచేయిద్దాం. తరువాత కరెంటు దీపాలు పెట్టిద్దాం. ఏమంటారు ?" అన్నాడు.

వాళ్లుచెప్పిన ప్రదేశాలలో రెండు బావులు తవ్వించాడు. త్వరలోనే కరెంటు దీపాలకు ప్రయత్నాలు సాగించాడు. అధికారుల చుట్టూతిరిగాడు. డబ్బుతో వాళ్ళను వశపరచుకున్నాడు కొంచెమాలస్యమయినా పని పూర్తికావటానికి కాళ్ళ రిగిపోయేటట్టు తిరిగాడు. తిరిగి తిరిగి విజయం సాధించాడు.

క్రమంగా ఆ గ్రామస్థులచేతనే కొట్లుపెట్టించాడు - నిత్యవసర వస్తువులు అమ్మటానికి.

ఒకరోజు పూజారిని పిలిచి ఏమయ్యా, నీకు ఉదయం సాయంత్రం గుడి పని ఉండనేఉంది. ఈ ఊరిపిల్లలు ఊరికే ఇటూఅటూ తిరుగుతూ గొడ్లనుకాస్తూ ఉన్నారు. ఊరిగొడ్లను కాసేటందుకు పొలంపనులు చేయలేనివాళ్ళకు ఒప్పగించి,

ఆ పిల్లలందరికీ చదువుచెప్పు. ఇక్కడెవ్వరికీ అక్షరమ్ముక్కరాదు. అన్నిదానాల కంటె విద్యాదానం ఉత్తమమైనదంటారు పెద్దలు. మంచిరోజుచూసి చింతచెట్టు నీడలో కూర్చోబెట్టి అక్షరమ్ముక్కలు చెప్పు!'' అన్నాడు.

రామన్నచౌదరి చెప్పిన తరువాత ఆ పనిచేసితీరాల్సిందే. ఆ మంచిరోజూ నాలుగురోజులకే కుదిరింది.

వెంకటాచారి ఊరిపిల్లలందరినీ పిలిచి మధ్యాహ్నం రెండుగంటలనుంచి నాలుగుగంటలవరకూ చెట్టుకింద కూర్చోబెట్టి, ''మీరందరూ రేపటినుంచీ చదువుకోవాలి. చదువు ప్రారంభించేముందు విఘ్నేశ్వరుడికి దణ్ణాలుపెట్టుకుని కానుకలు సమర్పించిరండి. మీకు విఘ్నం కలగకుండా చదువు సాగుతుంది" అని బుజ్జగిస్తూ చెప్పాడు.

అంతకుముందే పూజారి పిల్లలకూ పెద్దలకూ "సాయంకాలంవేళ పూజ చేస్తాను. హారతి ఇచ్చేవేళకు రండి. ప్రసాదం తీసుకుందురుగాని" అనిపిలిచాడు. ఒకవారమయిన తరువాత "దేవుడి దగ్గరికి ఉత్తచేతులతో రాకూడదు. మీకు తోచిన డబ్బులు హారతి పళ్ళెంలోవెయ్యాలి" అనేవాడు. వాళ్ళంతా వేసినపైసలు మూడు నాలుగురూపాయలయ్యేవి. ఈ చదువుతో పదిరూపాయలవరకూ ఆదాయం పెరిగింది, బెల్లంముక్కలు వాళ్ళచేతుల్లో పెట్టేవాడు.

వర్షం వచ్చిననాడు చెట్టుకింద బడి నడిచేదికాదు. వెంకటాచారికి అదాయం తక్కువయ్యేది.

ఒకనాడు ఆయనే రామన్నచౌదరిని కలుసుకుని "అయ్యా, వర్షం వచ్చినప్పుడు పిల్లల చదువుకు ఇబ్బందిగా ఉంది. ఒక పూరిపాక వేయించండి. ప్రతిరోజు చెప్పకపోతే వచ్చిన అక్షరాలు కూడా పిల్లలు మరచిపోతారు. మీరు తలపెట్టిన కార్యం నిర్విఘ్నంగా సాగిపోవాలంటే పాక వేయించకతప్పదు'' విన్నవించుకున్నాడు.

రామన్నచౌదరి మంచిలౌక్యం తెలిసినవాడు-వెంటనే గ్రామస్థులను పిలిచి ''మీ పిల్లలు ఎప్పుడూ గొడ్లు కాసుకునే వాళ్ళుగానే బతికితే ఈ కాలంలో ఎందుకూ పనికిరారు. పెద్దచదువులు చదువుకోవాలి. పెద్ద ఉద్యోగాలుచేయాలి. లోకంలో ఏంజరుగుతుందో తెలుసుకోవాలి మన ఊరిని బాగుచేసుకోవాలి. మన ఊరి

కింకా కావలసిన వెన్నోఉన్నాయి. ఒక బడి కావాలి. మీ పిల్లలు అక్షరాలు నేర్చుకుంటేచాలదు. గవర్నమెంటు బడిలాంటిది మన ఊళ్ళోనే పెట్టుకుందాము. మన ఊరికి వైద్యాలయం కావాలి. మనవాళ్ళు సరియైన వైద్యంలేక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మనపిల్లలు చదువుకుంటే వాళ్ళల్లో కొందరు డాక్టర్లు కావచ్చు. కొందరు ఇంజనీయర్లు కావచ్చు. కొందరు పంతుళ్ళుకావచ్చు. నేను చెప్పేదంతా మన గ్రామంకోసమే ఏమంటారు ?'' ఒక పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు.

పదిరోజుల్లో ఆ గ్రామీణులు తాటిచెట్లను కొట్టి దూలాలుగా వాసాలుగా కోసారు. పెద్దపాక వేశారు. తాటాకులతో పూరిపాకను తయారుచేశారు. లోపల మట్టిపోసి ఎత్తుచేశారు. వర్షపుజల్లు లోపలికి రాకుండా పొట్టిగోడల మట్టితోకట్టారు. పూతలుపూసి వెల్లవేశారు. మంచిరోజుచూసి ఒక సరస్వతీ విగ్రహం కొనుక్కొచ్చారు. పూజలుచేశారు. పూలదండలు వేశారు. కొబ్బరికాయకొట్టి కర్పూరహారతి వెలిగించారు. పిల్లలకు బెల్లమ్ముక్కపెట్టి ప్రారంభోత్సవం రామన్న చౌదరి చేత చేయించారు.

పిల్లలు అక్షరాలు-మాటలు రాయటంనేర్చుకుంటున్నారు. పిల్లలు గుడికి వెళ్ళి హారతిపళ్లెంలో పైసలు వేస్తున్నారు. పెరట్లో పండిన కూరగాయలూ పండ్లు బళ్ళోపంతులుకి సమర్పిస్తున్నారు. దసరాపండగ రాగానే పిల్లలను తీసుకుని ఇంటింటికీవెళ్ళి ''అయ్యవారికిచాలు అయిదువరహాలు-పిల్లవాళ్ళకుచాలు పప్పుబెల్లాలు" అంటూ పాటలు పాడించేవాడు వెంకటాచారి. తమపిల్లలు బాగా చదువుకుని పండితులయి పెద్ద ఉద్యోగాలు చేస్తారని ప్రతిఇంట్లోను పిల్లలనూ పంతులునూ సత్కరించేవారు. కొందరు కొత్తపిల్లలను బడిలో చేర్పించేముందు పంతులుగారికి నూతనవస్త్రాలు సమర్పించేవారు.

అలాక్రమంగా పిల్లలకు చదువూ వెంకటాచారికి ఆదాయం పెరుగుతూ వచ్చింది.

ఒకనాడు రామన్నచౌదరి అందర్నీపిలిచి ''మన పెద్దలేమన్నారంటే ప్రతిగ్రామానికి విద్యాలయమూ దేవాలయమూ, వైద్యాలయామూ గ్రంథాలయమూ తప్పకుండా ఉండాలన్నారు ఇవిలేకపోతే ప్రజలకు అభివృద్ధిలేదన్నారు. మన ఊరికి ఒక దేవాలయం ఉంది. విద్యాలయం చిన్నది ఏర్పరచుకున్నాం దాన్ని పెద్దది చేయాలి. ఇంక వైద్యాలయం ఒకటి అవసరంగా ఉంది. ఎవరికే జబ్బు

చేసినా పట్నం పోనక్కరలేదు. దీనికూడా ఒక పూరిపాకను ఇంకా పెద్దది కట్టుకుందాం. పెద్దచావడి కట్టి దానిలో అడ్డగోడలుకట్టి గదులుగా చేస్తే పదిమంది ఉండచ్చు. వాటిముందర వరసగా నులకమంచాలు వేయచ్చు. ఏమంటారు ?'' అన్నాడు.

రామన్నచౌదరి మాట వేదవాక్కు ఆ గ్రామస్తులకు. అందరూ "అవును. మనఊరికి చాలా అవసరమని తలలూపారు. ఆ పనంతా గ్రామస్తులచేతనే చేయించాడు చౌదరి. ఊరిచివర పెద్ద వైద్యాలయం నిర్మాణమయింది, రామన్న చౌదరి చెయ్యిమంచిదని ఆ ఊరివాళ్లు ఆయన చేతనే ప్రారంభోత్సవం చేయించారు. ఖర్చులన్నీవాళ్ళే భరించారు. చౌదరి పట్నంవెళ్ళినప్పుడు వారానికొకసారివచ్చి చూసేటట్టుగా ఒక ప్రయివేటు డాక్టర్ని మాట్లాడి తీసుకువచ్చాడు. మామూలు జబ్బులకు ఇచ్చేమందులతో ఇంజక్షను సామాన్లతో ఒక నర్సు ఒక వార్డుబాయితో ఆయనవచ్చి ఆ పాకలోకి వచ్చిన రోగులను చూసేవాడు. మందులిచ్చేవాడు. నర్సుచేత పురుళ్ళు పోయించేవాడు. పిల్లలకు టీకాలు వేయటం, మందులివ్వటం మొదలైన వైద్యాలు జరుగుతూ ఉండేవి.

ప్రతి కార్యక్రమానికీ పూజారి శుభమూహూర్తం పెట్టవలసిందే. దక్షిణ తాంబూలం తీసుకోవలసిందే. ప్రతి శుభకార్యానికీ పూజారికి ఆహ్వానం రావలసిందే, భోజన దక్షిణ తాంబూలాది సత్కారం జరగవలసిందే.

రామన్నచౌదరి అలాగే పట్టుదలతో ఒక గ్రాడ్యుయేటయిన టీచర్ని తీసుకువచ్చాడు. ఆయన కొంతకాలం చదువుచెప్పిన తరువాత మరొక టీచర్ని-ఇలా నలుగురు టీచర్లని తీసుకువచ్చాడు. ఐదుక్లాసులవరకూ బడి అంతస్తు పెరిగింది.

వీటన్నిటికీ ఖర్చులు గ్రామస్తులే భరిస్తూ వస్తున్నారు.

ఎవరూ చెప్పకపోయినా వెంకటచారి వీటన్నిటినీ ఎప్పుడో ఒకప్పుడు రోజుకొకసారి పర్యవేక్షిస్తూ ఉండేవాడు. కొంతకాలానికి ఆయన అవసరము కూడా పెరిగిపోయింది. రామన్నచౌదరి ఊళ్ళోలేకపోయినా వెంకటాచారి ఆయన కార్యక్రమం అంతా చూసుకునేవాడు. తీరికచేసుకుని ప్రతియింటికీ వెళ్ళి యోగక్షేమాలు కనుక్కునేవాడు.

టీచర్లు వచ్చిన తరువాత వార్తాపత్రికలు తెప్పించి వార్తలుచదివి ఊరి

వాళ్ళకు చెప్పే కార్యక్రమం వెంకటాచారే స్వయంగా ఏర్పాటుచేశాడు. పిల్లలు యింటికివెళ్లగానే విద్యాలయం గ్రంథాలయంగా మారేది.

క్రమంగా నలుగురిలో పలుకుబడిని వెంకటాచారి సంపాదిస్తూవచ్చాడు. పలుకుబడి పెరిగినా తనవినయవిధేయతలను మాత్రం ఆయన మరచిపోలేదు. ఆయన రాబడి యథాప్రకారం సాగుతూనేఉంది. చాపకిందనీరులా ఆయన కుటుంబం పూటకు గతిలేనిదిగా ప్రవేశించి ఐదారేళ్లల్లో దిగువ మధ్యతరగతి స్థాయికి చేరుకుంది.

ఈమధ్య రామన్నచౌదరి పెద్దపెద్ద నాయకులను కలుసుకోవటానికి తరుచుగా బైటికివెళ్ళి వారంపదిరోజులకు గాని తిరిగివచ్చేవాడు కాదు. వచ్చేటప్పుడు స్కూలు టీచర్లకు జీతాలక్రింద కొంతడబ్బుతెచ్చి సర్దేవాడు.

స్కూలుటీచర్లూ వైద్యాలయంలో పనిచేసేవాళ్లూ ఏది కావాలన్నా వెంకటాచారిని అడగటం ఆయన గ్రామస్తులదగ్గరనుంచి కొంత సేకరించి సర్దటం కూడా జరుగుతూ వచ్చింది.

"కొంచెం ఓపికపట్టండి నేనెలాగో సర్దుతాగా! ఇవి ప్రైవేటు సంస్థలు. విరాళాలు తేవటానికే చౌదరిగారు వెళ్ళారు" అని తన మంచితనాన్ని వాళ్లదగ్గర పెంచుకుంటూవచ్చాడు. ఊరివాళ్లకు సరేసరి—తలలో నాలుకయిపోయాడు. చిన్న చిన్న తగాదాలు తీర్చటం, వాళ్ళకష్టసుఖాలను ఓపికతో విని సలహాలివ్వటం గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకోవటంతో పరపతీ అభిమానమూ ఏర్పడ్డాయి.

ఎలక్షను పదిరోజులుండనగా రామన్నచౌదరి వచ్చాడు. ఊరివారినందరినీ సమావేశపరచి ఆ ఊరిని ఇంకా తానెంతో అభివృద్ధి చేయదలచుకున్నదీ వివరించి చెప్పాడు. విద్యాలయం వైద్యాలయం, దేవాలయం, గ్రంథాలయం పూరిపాకల్లో కాకుండా వాటికి పెద్దపెద్ద భవనాలు కట్టిస్తానంటూ వర్ణించిచెప్పాడు. ఆ గ్రామన్ని ఒక ఆదర్శగ్రామంగా చేస్తానన్నాడు.

"అయితే వాటన్నిటికీ అధికారహోదా ఉంటేగాని సాగవు. అధికారహోదా అంటే—మీరందరూ నాకు ఓటువేసి నన్ను సర్పంచినిచేసి ఆ అభివృద్ధిని నాచేతి మీదుగా జరగనివ్వండి. మీరంతా నామీదచూపే గౌరవమూ ఇంతాఅంతాకాదని నాకుతెలుసు. మనమంతా మొదటినుంచీ అన్నదమ్ములుగా ఈ గ్రామంలో బతుకు

తున్నాం. నా వెర్రిగాని ఇదంతా మీకు తెలియదూ?" అని ఒక పెద్ద ఉపన్యాసం ఇచ్చాడు.

అప్పటినుంచీ 'సర్పంచ్ అయిన తరువాత ఎట్లాఉండాలి-ఏంచెయ్యాలి'-ఎలామాట్లాడాలి అందరితో-వెంటనే వాళ్ళుచెప్పిన పనులన్నీచేసి బెట్టుచెడగొట్టుకోవటమా? వంటి ఆలోచనలో మునిగి ఊహాలోకంతో విహరించటం మొదలుపెట్టాడు.

ఆయనకు గట్టినమ్మకం ఉంది-'ఆ ఊళ్ళో తనుకాక ఇంకెవరున్నారు? పోటీచేసేవారెవరు?' అని. అసలు పోటీలేకుండానే ఎన్నికవుతాననుకుని ధైర్యంతో నిశ్చింతగా ఉన్నాడు. మధ్యమధ్య ఊళ్ళోఉన్నవాళ్ళను హెచ్చరిస్తూ ఉండేవాడు. ఆప్యాయంగా యోగక్షేమాలు విచారిస్తూ ఉండేవాడు.

ఎన్నికల రోజున-యధావిధిగా పాఠశాలలో ఓట్లపెట్టెపెట్టారు. ఓట్లు వెయ్యటానికి పేర్లురాయటానికి ముద్రలువెయ్యటానికి లాంఛనప్రాయంగా అధికారులను నియమించింది ప్రభుత్వం. ఒక్కొక్కరూ వెళ్ళి తమ ఓటును డబ్బాలో వేసి వచ్చారు.

అదంతా తనకు జరుగుతున్న గౌరవమని రామన్నచౌదరి సంతోషించాడు.

తీరా ఎన్నికల ఫలితాలు ప్రకటించినప్పుడు అందరిచెవులలో పడ్డపేరు శ్రీమాన్ వెంకటాచార్యులది.

మెడనిండా దండలువేసుకుని రామన్నచౌదరికి పాదాభివందనంచేసి "ఇదంతా మీ ఆశీస్సుల ఫలితం" అన్నాడు శ్రీమాన్ వెంకటాచార్యులు.